# దారి

యం.రమేష్‌కుమార్

'వారం రోజుల్లో ఢిల్లీలో ఒక ఇంటర్వ్యూకు అటెండవ్వాలి, ఓ.బి.సి. సర్టిఫికెట్ కావాలి' అంటూ బెంగళూరు నుంచి ఫోన్ చేశాడు అన్నయ్య. డిపార్ట్‌మెంట్ నుంచి ఇంటర్వ్యూకు హాజరవుతున్నాడట. అందులో గనుక సెలెక్టయితే మంచి పొజిషన్లోకి వెళ్తానని చెప్పాడు. నిజానికి అన్నయ్య దగ్గర ఓ.బి.సి. సర్టిఫికెట్ పాతది ఉంది. అది సరిపోతుందని అనుకున్నాడట. కానీ వాళ్లు పంపించిన చెక్‌లిస్టులో ఆరునెలల లోపుగా చేయించిన సర్టిఫికెట్ ఉండాలని వుందట. దాంతో ఎలాగైనా వెంటనే చేయించి పంపమంటూ ఫోన్ చేశాడు.

ఎమ్మార్వో ఆఫీసు పనంటే అంత తొందరగా అయ్యేది కాదని నాకు తెలుసు. వారంలో పంపించడమంటే కష్టమే. అయినా వెంటనే పోస్టు చేసినా బెంగుళూరు చేరేసరికి కనీసం ఐదారు రోజులు పడుతుంది. అలాంటిది సర్టిఫికెట్ చేయించేదెప్పుడూ? పంపించేదెప్పుడు? ఆ మాటే అన్నయ్యతో అన్నాను.

'ఫర్వాలేదు. కుదరకపోతే నేను అక్కడ టైమడుగుతాను. పది పదిహేను రోజుల్లో పంపుతానని చెప్పి డిక్లరేషన్ ఇస్తాను. ముందు నువ్వు పని మొదలుపెట్టు..అదే అవుతుంది'' అన్నాడు.

ఎప్పుడైనా అవసరం రావచ్చని చెప్పి అప్లికేషన్‌తోపాటు ఓ.బి.సి. ప్రొఫార్మా నింపి సంతకాలు పెట్టి నా దగ్గర ఉంచాడన్నయ్య. మరుసటి రోజు దాన్ని వెలికి తీసాను. దానిమీద ముందుగా కావల్సింది వీఆర్వో సంతకం. అందుకని ఎమ్మార్వో ఆఫీసుకి వెళ్ళి వీఆర్వో గురించి ఎంక్వయిరీ చేశాను.

"ఆయనీ టైంలో ఉండరు. ఉదయం పదిన్నర తర్వాత రండి'' అన్నారు.

ఉదయాన్నే అంటే నాకు వీలుపడదు. వెళ్లాలంటే స్కూలుకి సెలవు పెట్టాలి. ఎలా అనుకుంటుండగా అక్కడొకాయన నన్ను గుర్తుపట్టి "మాష్టారూ! ఆయన్ని కలవాలంటే ఇక్కడికొచ్చే బదులు ఉదయం ఎనిమిదింటికల్లా ఆయనింటికి వెళ్ళిపోతే మంచిది'' అన్నాడు. వీఆర్వోగారి ఎడ్రస్ కూడా చెప్పాడు. అది మా ఇంటికి నడిచి వెళ్లేంత దూరంలోనే ఉంది.

★★★

మర్నాడు ఉదయం పావుతక్కువ ఎనిమిదికల్లా బైల్దేరి ఆయన ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాను. అదృష్టవశాత్తూ ఆయన ఇంట్లోనే ఉన్నాడు.

అక్కడ నాలాగే ఆయన సంతకాలకోసం వచ్చినవాళ్ళు నలుగురైదుగురున్నారు. బహుశా బిసి, ఓబిసి, ఇన్‌కం...ఇలాంటి సర్టిఫికెట్లకోసమే వచ్చుంటారు. ఓ పావుగంట వేచి ఉన్నాక ఆయన బైటికొచ్చాడు. నేను ఆయన్ని గుర్తుపట్టాను. ఇంతకుముందు నేను పనిచేసిన ఊళ్లోనే ఆయన కూడా వీఆర్వోగా చేసాడు.

ఆయన కూడా నన్ను గుర్తుపట్టి "ఏం మాష్టారూ! ఇలా వచ్చారేమిటి?'' అన్నాడు.

నేను విషయం చెప్పి సంతకం కోసం వచ్చానని చెప్పాను. ఆయన నేను తెచ్చిన ప్రొఫార్మా అంతా పరిశీలించాడు. అంతా సరిగ్గానే ఉందది. దానికి పాత ఓ.బి.సి. సర్టిఫికెట్ జతచేశాను.

"మాష్టారూ! బి.సి సర్టిఫికెట్‌కయితే ఫర్వాలేదుగానీ ఓబిసికి ప్రొఫార్మాతోపాటు ప్రొసెస్ కూడా ఎక్కువే. ఓబిసి ఇవ్వాలంటే అభ్యర్థి క్రిమీ లేయర్ పరిధిలోనికి రాడని తెలిపే ప్రూఫ్ ఉండాలి. అంటే అతని వార్షికాదాయం క్రిమీలేయర్‌లో సూచించిన ఆదాయ పరిమితికన్నా తక్కువే ఉందని తెలియాలి. అందుకోసం మీరు ఈ ప్రొఫార్మాతోపాటు అభ్యర్థి పే సర్టిఫికెట్ కూడా జతచేయాలి'' అన్నాడు.

'చచ్చాంరా నాయనా' అనుకున్నాను. పే సర్టిఫికెట్ అన్నయ్య బెంగుళూరు నుంచి పంపించాలి. అది వచ్చేసరికి కనీసం వారం పడుతుంది.

నేను ఆయనకు సర్టిఫికెట్ తొందరగా కావాల్సిన అవసరం చెప్పి ఎలాగైనా వీలవుతుందేమో చూడమన్నాను.

"మొహమాటంకొద్దీ నేను సంతకం పెట్టినా ఆర్ఐ సంతకం చెయ్యడు. ఆయన తప్పనిసరిగా పే సర్టిఫికెట్ అడుగుతాడు. అదే ప్రొసీజర్ కూడా. అప్పుడైనా మీకు తప్పదు'' వివరించాడు.

ఆ మాటతో ఇంక నేను వెనుదిరగక తప్పలేదు. అన్నయ్యకు విషయం చెప్పి పే సర్టిఫికెట్ వెంటనే పంపించమని చెప్పాను.

వారం రోజుల్లో పే సర్టిఫికెట్ నా చేతికి అందింది. ఈలోపు అన్నయ్య ఢిల్లీ ఇంటర్వ్యూకు ఎటెండ్ కావడం, అక్కడ ఇంటర్వ్యూ అయ్యాక, వాళ్లు ఓబిసి సర్టిఫికెట్ సబ్మిట్ చెయ్యడానికి ఇరవై రోజుల గడువివ్వడం జరిగిపోయాయి. పే సర్టిఫికెట్ జతచేసి తీసుకెళ్ళగానే వీఆర్వో సంతకం అయిపోయింది.

మరుసటిరోజు స్కూలునుంచి సరాసరి ఎమ్మార్వో ఆఫీసుకు వెళ్లి ఆర్.ఐ.గారి గురించి అడిగాను.

"ఏదో ఎంక్వైరీకోసం వెళ్ళారండీ..'' అక్కడి క్లర్కు చెప్పాడు.

"ఎప్పుడొస్తారు?'' అడిగాను.

"చెప్పలేం''

"పోనీ రేపు ఏం టైమ్‌లో ఉంటారో చెప్పగలరా?'' అడిగాను.

"కరెక్టుగా అంటే చెప్పలేం సార్...ఆయనేవో ఎంక్వైరీల మీద తిరుగుతుంటారు. ఉదయం పదిన్నర తర్వాత ఓసారి రండి..లేదంటే మధ్యాహ్నాం మూడు తర్వాత రండి...దొరకచ్చు..'' అన్నాడు.

మర్నాడు కూడా నాకు ఆయన దర్శనం కాలేదు.

మళ్ళీ మరుసటి రోజు నాలుగ్గంటలకు వెళ్ళాను. ఈసారి అదృష్టం నా పక్షాన్నే ఉంది. ఆర్.ఐ. ఉన్నారు. నేను ప్రస్తుతం పని చేస్తోన్న గ్రామం వీఆర్వో కూడా సమయానికి అక్కడే ఉన్నారు. ఆయన నన్ను పలకరించి విషయం కనుక్కొని, ఆర్.ఐ.కి పరిచయం చేశారు.ఆర్ఐగారు నేను తెచ్చిన ప్రొఫార్మా అంతా పరిశీలించారు. పే సర్టిఫికెట్ కూడా చూశారు.

"ఈ సర్టిఫికెట్‌తోపాటు ఒక నోటరీ కూడా చేయించి తేవాలండి'' అన్నాడాయన.


"నోటరీయా? అది దేనికి సార్..?'' అడిగాను.

"అంటే మీ బ్రదర్‌కి ఉద్యోగపరంగా వచ్చే ఆదాయం తప్ప వేరే ఆదాయాన్నిచ్చే ఆస్తులేమీ లేవని చెప్పి నోటరీ ఉండాలి. అది చేయించి తెచ్చేయండి. చేసేద్దాం...''

నాకు ఏమనాలో తోచలేదు. నోటరీ అంటే అన్నయ్య సంతకం ఉండాలి. అంటే మళ్ళీ బెంగళూరు నుంచి అది రావాలి...అంటే కనీసం మరో వారం...ఏం చేయాలి?

ఉద్యోగం మీద ఆధారపడి బ్రతికేవాళ్ళమే తప్ప మాకు వేరే ఆస్థిపాస్తులేమీ లేవండి అని చెప్పాలనిపించలేదు. ఎందుకంటే నేను ఆమాటంటే నోటి మాట ద్వారా కాదు...నోటు మాట (నోటరీ) ద్వారా కావాలంటాడని తెలుసు. పెన్షన్ తీసుకొంటున్న వాడు ఎదురుగా నిలబడి 'నేను బ్రతికే ఉన్నాను బాబూ...పెన్షనిప్పించండి' అంటే ఎవడూ పట్టించుకోడు. బ్రతికే ఉన్నట్టు లైవ్ సర్టిఫికెట్ తీసుకొచ్చి సమర్పించాల్సిందే కదా!


మళ్ళీ అన్నయ్యకు ఫోన్ చేసి విషయం చెప్పాను. 'సరే..అలాగే కానీ..' అంటూ పది రూపాయల స్టాంపు పేపర్‌మీద సంతకం పెట్టి రిజిష్టర్డ్ పోస్టులో పంపించాడు. దానిమీద కావలసిన విధంగా టైప్ చేయించి, తెలిసిన లాయర్‌గారి ద్వారా నోటరీ చేయించాను.



ఈ తతంగమంతా పూర్తికావడానికి పది రోజులు పట్టింది. ఢిల్లీకి సర్టిఫికెట్ చేరడానికి వారం రోజుల సమయం మాత్రమే ఉంది. ఇక్కడ చూస్తే పని మధ్యలోనే వుంది. 'సర్లే..నాలుగైదు రోజులు అటూ ఇటూ అయినా ఫరవాలేదని చెప్పాడు కదా..సర్టిఫికెట్ చేతికొస్తే ఢిల్లీ ఆఫీస్ అడ్రస్ కనుక్కొని ఇక్కణ్ణుంచే పోస్టు చేయ్యొచ్చు' అని సమాధానపడ్డాను.


అప్లికేషన్‌తోపాటు నోటరీ జతచేసి ఆర్.ఐ.ని కలిశాను. ఈసారి ఆయన వెంటనే దొరికాడు. నోటరీ చూసి సంతృప్తి వ్యక్తం చేశాడు. ఇంక పని అయిపోయినట్లే అనుకొన్నాను. ఆయన సంతకం అయిపోతే చాలు...ఎమ్మార్వో సంతకం ఒకరోజులోనే అయిపోతుంది. అయితే నా ఆనందం ఎంతోసేపు నిలవలేదు. ఆర్.ఐ. మరో మెలిక పెట్టాడు.

"అంతా బానే ఉందిగానీ ఈ మధ్య క్రిమీలేయర్ పరిమితి పెంచుతూ జీవో వచ్చిందండీ...అది మా దగ్గర లేదు. మీరు కాస్త ఆ జీవో సంపాదించి దీనికి జతచేస్తే మీ పని అయిపోయినట్టే.." అన్నాడతను.



## నిజమే చెబుతున్నాను

కత్రినా కైఫ్ గ్లామరే గ్లామరు అంటారు చాలామంది. మరి అంతటి అందాలరాశి- అందంలోని రహస్యం ఏంటి అని సందేహం వ్యక్తపరిచే వాళ్లూ వుంటారు కదా! ఆ మాటే మనం అడిగితే 'అబ్బే ఏం లేదండీ? నిజంగానే చెబుతున్నాను, రోజుకో కేరట్ తింటానండీ, అంతే ఇంకే ప్రత్యేక జాగ్రత్తలూ తీసుకోనండీ' అంటూ చిన్నగా నవ్వులు విసురుతుంది.




ఆర్ఐ మనసులో ఏముందో నాకర్థం కాలేదు. డబ్బులిస్తే పనైపోతుందన్న ఆలోచనైతే నాకు రాలేదు.

"ఆ జీవో ఎక్కడ దొరుకుతుంది సార్?" అడిగాను.

"అది మా ఆఫీసులో లేదండీ...బహుశా పక్క ఊరి రెవిన్యూ ఆఫీసులో దొరకొచ్చు. లేదంటే డిస్ట్రిక్ట్ హెడ్‌క్వార్టర్స్‌లో దొరుకుతుంది" అన్నాడు.

నేను "సరే సార్..." అంటూ బైటకొచ్చాను.

నాకు విక్రమార్కుడు బేతాళుడి కథలు జ్ఞాపకం వచ్చాయి. సరే..అదీ చూద్దాం.. జీవో సంపాదించి వెళితే సరి అప్పుడు కూడా ఏమైనా అడ్డుపెడితే ఎలా ప్రొసీడవ్వాలో ఆలోచించుకోవచ్చు అనుకున్నాను.

షరా మామూలుగా అన్నయ్యకు ఫోన్ చేసి విషయం చెప్పి, నేనిక్కడ ట్రై చేస్తాను. నువ్వు కూడా ఆ జీవో కోసం అక్కడ ప్రయత్నించు అని చెప్పాను. కానీ ఆ జీవో ఎక్కడా లభ్యం కాలేదు.

కొన్ని ప్రయత్నాలు చేసాక ఆ జీవో తేవడం నావల్ల అయ్యేపనిలా లేదనిపించింది. అసలు వాళ్లకవసరమయ్యే జీవో వాళ్ళ ఆఫీసులో ఎందుకుండదో...దాన్ని తెమ్మని నన్నడగడం ఏమిటో నాకర్థం కాలేదు.

సమయం మించిపోతోంది. ఇలా అయితే లాభంలేదు. దీనికి వేరే మార్గం ఆలోచించాలనుకున్నాను. అప్పుడే మామయ్యకి ఫోన్ చేద్దామన్న ఆలోచన వచ్చింది. ఆయన రాజకీయాల్లో తిరుగుతుంటాడు. కలెక్టరాఫీసుకి కూడా తరచుగా వెళ్తుంటాడు. జీవో గురించి ఆయనకు చెప్తే సంపాదిస్తాడనిపించింది. ఫోన్ చేసి చెప్పాను. ఆయన అలాగే అన్నాడు. కానీ ఆయన కూడా ఆ జీవో సంపాదించలేకపోయాడు.

అసలు ఇలా జీవో గురించి తిప్పలు పడేబదులు సరాసరి ఎమ్మార్వోగార్ని కలిసి విషయం వివరిస్తే ఆయనే కన్సిడర్ చేస్తారేమో అనిపించింది.

సాయంత్రం ఆఫీసుకి వెళ్లి డైరెక్టుగా ఎమ్మార్వోగార్ని కలిశాను. విషయం మొత్తం వివరించాగానే ఆయన అర్థం చేసుకొని ఎక్కువ ప్రశ్నలు వెయ్యకుండానే. "సరే...ఆర్.ఐ.కి చెప్తాను...అయిపోతుందిలెండి" అన్నారు. నేను ఆర్.ఐ.రూమ్ వైపు నడిచాను. ఆ వెంటనే అటెండర్‌ద్వారా విషయం ఆర్.ఐ.కి చేరింది.

ఏమనుకున్నాడో మరి...ఆర్.ఐ. నన్ను చూడగానే అదోరకంగా నవ్వుతూ..."రండి..రండి..మీ కాయితాలు సంతకంపెట్టి ఎమ్మార్వోకి పంపించేస్తాను. జీవో గొడవ ఆయనే చూసుకుంటాడులెండి..." అన్నాడు. అదేదో ఎమ్మార్వోయే జీవో అడిగినట్టు.

ఆర్.ఐ. నా కాయితాలు వెతికి తీసి సంతకం పెట్టి ఎమ్మార్వోకి పంపించే సరికి ఆయన వెళ్ళిపోయారు.

ఈ సర్టిఫికెట్‌కు ఇన్ని అడ్డంకులా? అని చిరాకు పడబోయి..సరే ముగింపు దశకొచ్చేసింది కదా..రేపొచ్చి తీసుకోవచ్చు అనుకుంటూ వెళ్ళాను. మరుసటిరోజు సాయంత్రం ఆఫీసుకి వెళ్ళేసరికి..."ఇప్పుడే టేబుల్‌మీద కాయితాలన్నీ చూసి సంతకం పెడుతున్నారు. మీ సర్టిఫికెట్ వచ్చేస్తుంది..కాస్తాగండి" అన్నాడు అటెండర్.

నేను అక్కడే బెంచీమీద కూర్చున్నాను.

"వచ్చేస్తుంది సార్..అదిగో సంతకాలు అయిపోవచ్చాయి" అవసరం లేకపోయినా లోనికెళ్ళొచ్చి మళ్ళీ అన్నాడు అటెండర్.

కాయితాలు మొత్తానికి బైటికొచ్చాయి. అటెండర్ వాటిని తీసుకొని మరో రూమ్‌లోనికెళ్ళాడు. అతని వెనకే నేనూ వెళ్ళాను.

"రండి సార్ రండి...మీ సర్టిఫికెట్‌మీద స్టాంపు వేసి ఇచ్చేస్తాను" అంటూ అంతవరకూ ఇంకెవరికైనా చిక్కిపోతుందేమో అని జేబులో పెట్టుకున్న స్టాంపును బైటికి తీసి సర్టిఫికెట్ మీద వేశాడు.

సర్టిఫికెట్ నాకందించి చేతులు నులుముకుంటున్న అతని తీరు చూసి

నాకర్థమైంది. జేబులోంచి ఓ నోటు తీసి అందించాను. నవ్వుతూ తలాడించాడతను. ఇందుకేనన్నమాట..నాతో అంత జాగ్రత్తగా సర్టిఫికెట్ వచ్చేస్తుందంటూ పదే పదే చెప్తున్నాడు అనుకున్నాను.

చేతికి వచ్చిన సర్టిఫికెట్‌ను తనవితీరా చూసుకొన్నాను. బహుశా సప్తసముద్రాల అవతల చిలకలో మాంత్రికుడి ప్రాణం ఉందంటే ఆ చిలక చేతికి చిక్కినప్పుడు రాకుమారుడికి కలిగిన ఆనందమేదో నాక్కలిగింది.

సర్టిఫికెట్ రిజిష్టర్డ్ పోస్టు చేసేశాక ఇంక ఆ విషయం మర్చిపోయాను.

★★★

పది రోజుల తర్వాత వెనకవీధి సుబ్బన్న కొడుకు సుధీర్‌ని తీసుకొని నా దగ్గరకొచ్చాడు.

'ఈడికి ఏదో సర్టిఫికెట్ అర్జంటవుసరం వచ్చిందట-బాబూ ఆ కాయితాలేవో నువ్వయితే సరిగా నింపి పెడతావని తెచ్చేడు మావోడు" అన్నాడు.

సుధాకర్ బియ్యేస్సీ కంప్యూటర్స్ చేశాడు.

"ఏం సర్టిఫికెట్?" అడిగాను.

"ఓ.బి.సి. సర్టిఫికెట్‌కు అప్లై చెయ్యాలండి. ప్రొఫార్మా తీసుకొచ్చాను. నింపడంలో కొన్ని డౌట్లు వచ్చాయి. అందుకే మీ దగ్గరకొచ్చాను" అన్నాడు.

"ఓ.బి.సీ. దేనికి?" అడిగాను.

"హైదరాబాద్‌లో ఓ సెంట్రల్ గవర్నమెంట్ అండర్‌టేకింగ్ సంస్థలో ఇంటర్వ్యూకి కాల్ లెటర్ వచ్చింది. ఆల్‌రెడీ రిటెన్ టెస్టులో సెలెక్టయ్యాను. ఎల్లుండి రాత్రికి బైల్దేరుతున్నాను. ఈలోగా ఓ.బి.సి. సర్టిఫికెట్ చేయించుకోవాలండీ" అన్నాడు.

"ఏంటీ..రెండు రోజుల్లో ఓ.బి.సీ. సర్టిఫికెట్ కావాలా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవునండీ.."

ఆతన్ని నిరాశపరచడం ఎందుకులే అని ఇంకేమీ మాట్లాడకుండా ప్రొఫార్మా నింపి ఇచ్చేశాను.

వారం తర్వాత బజార్లో సుబ్బన్న కనిపించాడు.

"మీవాడు హైద్రాబాద్ వెళ్ళాడా?" అడిగాను.

"ఆఁ..ఎళ్ళొచ్చాడు బాబూ..అక్కడ బానే సెప్పానన్నాడు. ఉజ్జోగం సంగతి ఇంకా తేల్లేదు బాబూ" అన్నాడు.

"అదికాదు. ఓబిసి సర్టిఫికెట్ చేయించి తీసుకెళ్ళాడా?" అడిగాను.

"ఆఁ..సర్టిఫికెట్ పట్టుకెళ్ళాడు బాబూ.."

"రెండు రోజుల్లో సర్టిఫికెట్ చేతికొచ్చేసిందా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అంటే బాబూ...ముందు అదంత తొందరగా అయ్యే యవ్వారం కాదన్నారండి..మా బామ్మర్ది కొడుకున్నాడు గదండీ...పెసాదుగాడు..రాజకీయాల్లో తిరుగుతుంటాడు. ఆడెప్పుడూ ఎమ్మెల్లోతోనే ఉంటాడు బాబూ. అణ్ణి తీసుకొని ఎళ్ళాడు మావోడు. ఆడు ఎమ్మార్వాఫీసులో కాయితాలిచ్చేసి ఇది ఎమ్మెల్లే కాండీటు తాలూకా సర్టిఫికెట్ సాయంత్రానికల్లా అయిపోవాలని తాకీదిచ్చేడంట. సాయంత్రానిక్కాదుగానీ మర్నాడు మజ్జేనంకి సర్టిఫికెట్ అయిపోయిందన్జెప్పి పట్టుకొచ్చేడు మావోడు. మా పెసాదుగాడి పున్నెవా అని టయానికి సర్టిఫికెటు సేతికొచ్చేసింది. ఎంతైనా ఎమ్మెల్లే కాండీటు పనంటే ఆమాత్తరం సెయ్యరేటి బాబూ..." అన్నాడు సుబ్బన్న.


నేను ఇరవై రోజులపైగా తిరిగి సాధించిన సర్టిఫికెట్‌ను వీళ్ళు ఎమ్మెల్యే పేరు చెప్పి రెండురోజుల్లో సంపాదించారు.

నాకు బుర్ర తిరిగినంత పనైంది. ఎక్కడో చదివిన ఓ విషయం గుర్తొచ్చింది. రాజకుమారిని చేరుకోడానికి రాకుమారుడికి రెండు దార్లు ఉన్నాయట..ఒక గుమ్మం ముందు ఓ కాపలాదారుడు ఉన్నాడట. రెండో ద్వారం దగ్గర ఎవ్వరూ లేరు. రాకుమారుడు రెండోదారిని ఎంచుకొని మధ్యలో సింహాల్తో పోరాడి, కాలసర్పాలను తప్పించుకని, వాగులు వంకలు దాటి, కొండలెక్కి మొత్తానికి అష్టకష్టాలు పడి రాకుమారిని చేరాడట.

అక్కడికి వెళ్ళాక రాకుమారి అంతా విని 'అనవసరంగా చుట్టూ తిరిగి కష్టాలు పడ్డావు. మొదటి గుమ్మంద్వారా వచ్చేసి ఉంటే నేను ఇక్కడే ఉన్నాను. కాపలాదారుడికి కొన్ని రత్నాలు ముట్టజెప్పడమో, మచ్చిక చేసుకోవడమో లేదా ఎదిరించడమో..ఏదైనా అంతకంటే సులువే కదా...?' అందిట.

నా మొహంలో భావాలు సుబ్బన్న గమనించకుండా జాగ్రత్తపడి "అవునవును...ఎమ్మెల్యే కాండేటంటే ఆమాత్రం ఎందుకు చెయ్యరు మరి..?!" అని ఓ వెర్రి నవ్వు నవ్వి ముందుకి కదిలాను.

★



## విశ్వకవి

ఆ పిల్లవాడి తండ్రి ఓసారి హిమాలయాలకు వెళ్లాడు. అంతలో రష్యన్లు హిమాలయాన్ని ఆక్రమించుకున్నారన్న వదంతి వచ్చింది ఆ ఊళ్లో. అది విన్న ఆ పిల్లవాడి తల్లి భయపడిపోయి తండ్రికి ఉత్తరం వ్రాయమని పిల్లవాడికి చెప్పింది. కానీ ఆ పిల్లవాడికి ఉత్తరం ఎలా మొదలుపెట్టాలో తెలియలేదు. అప్పుడు ఉత్తరం రాయలేకపోయిన ఆ పిల్లవాడే పెద్దయ్యాక నోబెల్ బహుమతి పొందిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్.

-తటవర్తి

